క్లుప్తంగా

అల్లర్లను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



రాజుపాలెం: మండలంలోని గణపవరంలో పోలీసు అధికారులు సోమవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఎస్సీ, బీసీ, ముస్లిం మైనార్టీ కాలనీలలోని గృహాలను పరిశీలించారు. పాడుబడ్డ గృహాలతో పాటు గేదెల కొట్టాలను, గడ్డి వాములను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను, ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ షమీర్ బాషా మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరు వివాదాలకు వెళ్లవద్దని, అల్లర్లకు ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేల ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. ఏఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెలకు 10 కాన్పులు అయ్యేలా చూడాలి



రాజుపాలెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో రికార్డులు, రిపోర్ట్స్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంను ప్రతి నెల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. కాన్పుల గదిని పరిశీలించారు. ప్రతి నెల తప్పని సరిగా పది కాన్పులు జరిగేటట్లు చూడాలని డాక్టర్ కృష్ణకుమార్‌కు సూచించారు. రాబోయే మూడు నెలల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి మురళి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, స్టాఫ్ నర్సు చందన పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆటల దినోత్సవం



బెల్లంకొండ: అంతర్జాతీయ ఆటల దినోత్సవ వేడుకలను బెల్లంకొండలోని బేడా బుడగ జంగాల కాలనీలో గ్రేస్ మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రేస్ మహిళా మండలి అధ్యక్షురాలు డి.కీర్తన మాట్లాడుతూ ఆటలు ఆడటం వలన మనోవికాసం, శారీరక దృఢత్వానికి మేలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ లీడర్ ఊర సింహాద్రి, ఊర జకరయ్య, పాస్టర్ డి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్ హైస్కూలుకు అమెరికన్ అవార్డ్

అచ్చంపేట: గత కొన్ని సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలో విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న స్థానిక బ్లూబెల్స్ హైస్కూలుకు నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఉత్తమ పురస్కారాన్ని ప్రకటించినట్లు పాఠశాల హెచ్ఎం శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో సేవా దృక్పథంతో ఒక విద్యా సంస్థను స్థాపించి విద్య పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి నామమాత్రపు ఫీజులతో నడుపుతున్నామన్నారు. గత 5 సంవత్సరాలుగా టెన్త్ పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలను సాధిస్తూ రాష్ట్ర స్థాయి ప్రభుత్వ అవార్డులకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యే అవకాశం కల్పించామన్నారు. తమ సేవలను గుర్తించిన నార్త్ అమెరికా తెలుగు సంఘం వారు ఈ నెల 30న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పాఠశాల కరస్పాండెంట్ భవనం నిర్మల జ్యోతికి ఉత్తమ పురస్కారాన్ని అందించనున్నట్లు చెప్పారు. తమతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి విద్యా రంగంలో సేవలు అందిస్తున్న పలు పాఠశాలలకు చెందిన మరో 30 మంది నాట్స్ పురస్కారాలకు ఎంపికైనట్లు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో మంగళవారం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాగుల గుడి దేవస్థానంలో బహుళ షష్టి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

- లెక్కింపు రోజు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- మాక్ డ్రిల్, కవాతులతో ప్రజల్లో అవగాహన
- అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
- సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఎలాంటి గొడవలూ జరగకుండా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాలతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్ బాబు మంగళవారం తెలిపారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాల పరిధిలో అదనపు బలగాలతో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడ ఎలాంటి చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్నా బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పోలీసు బృందాలతో సత్తెనపల్లిలో మాక్‌డ్రిల్ నిర్వహించి అల్లర్లను ఉపేక్షించబోమని హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై ఆయన పలు అంశాలను వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

44 పల్లెల్లో పోలీస్ పికెట్..

పోలింగ్ రోజున జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకొని జూన్ 4న లెక్కింపు సందర్భంగా పలు ప్రాంతాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించాం. 44 గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశం ఉందని గుర్తించాం. వీటిలో ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాలతో ప్రత్యేక పికెట్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మొబైల్ బృందాలను పర్యవేక్షణకు నియమించాం. ఎన్నికల సమయంలో జరిగిన ఘటనల ఆధారంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురిని బైండోవర్ చేశాం. బైండోవర్ అయిన వారు గొడవలు సృష్టిస్తే వారిపై రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించాం. పోలింగ్ రోజు జరిగిన గొడవలకు సంబంధించి సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో 49 కేసులు నమోదు చేశాం.

45 మందికి నోటీసులు

ఎన్నికల సందర్భంగా 44 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి గొడవలు సృష్టించే వారిని ముందస్తుగా బైండోవర్ చేశాం. సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికలకు ముందు 3 వేల మందిని, ఎన్నికల అనంతరం 400 మందిని బైండోవర్ చేశాం. వీరిలో 63 మంది తిరిగి గొడవల్లో పాల్గొన్నట్లు గుర్తించాం. వీరిపై కేసులు నమోదు చేయడంతో పాటు ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున జరిమానా వసూలు చేసేలా 45 మందికి నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటున్నాం. వీరి వివరాలను ఆర్వోలు, తహసీల్దార్‌ల దృష్టికి తీసుకెళ్లి నోటీసులు పంపేలా చర్యలు చేపట్టాం. రౌడీషీటర్లు పాత నేరస్తులపై నిఘా ఉంచి వారి ప్రతి కదలికలను గమనిస్తున్నాం. వారికి పలు సార్లు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

నిబంధనలు అతిక్రమిస్తే రౌడీషీట్

సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో సమస్యాత్మక గ్రామాల నాయకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఎన్నికల కమిషన్ నిబంధనలు, వాటిని అతిక్రమిస్తే తీసుకునే చర్యలపై హెచ్చరికలు జారీ చేశాం. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి శాంతిభద్రతలు కాపాడాలని కోరాం. అతిక్రమించి గొడవలు సృష్టించిన 113 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేశాం. వీరిలో మార్పు చెందక పోతే జీవితాంతం ఇబ్బందులు పడతారని హెచ్చరించాం.

60 గ్రామాల్లో కార్డన్ సెర్చ్..

సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పట్టణంతోపాటు, గ్రామాల్లో సీఐ, ఎస్ఐ ఇతర సిబ్బందితో అనుమానిత గ్రామాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టాం. సబ్ డివిజన్ పరిధిలోని పట్టణంతోపాటు 60 గ్రామాల్లో తనిఖీలు చేపట్టి సరైన ధ్రువ పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశాం. వీటిని ఎంవీ పరిశీలనకు పంపాం. ధ్రువ పత్రాలు ఉంటే అప్పగిస్తాం. లేకుంటే చర్యలు ఉంటాయి. ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో 29 పెట్రోల్ బాంబులు స్వాధీన పరుచుకున్నాం. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పరిశీలన ఇంకా కొనసాగుతోంది.

విజయోత్సవాలకు అనుమతి లేదు..

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4 అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు, బాణాసంచా కాల్చడం వంటి వాటికి అనుమతి లేదు. 144 సెక్షన్ అమల్లో ఉంటున్నందున ప్రజలు గుమికూడి ఉండకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలి. అల్లర్లు సృష్టిస్తే తీవ్ర చర్యలు ఉంటాయి. పట్టణంలోని వార్డుల్లో, గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ముందస్తు పోలీసుల అనుమతులు తీసుకున్న అనంతరం ఇతరులకు ఇబ్బంది కలగకుండా విజయోత్సవం చేసుకోవాలి.

దమ్మాలపాడులో కార్డన్ సెర్చ్



దమ్మాలపాడులోని తనిఖీల్లో ఎస్సై పి.హజరతయ్య, సిబ్బంది

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని రూరల్ సీఐ ఎం.రాంబాబు చెప్పారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో రూరల్ సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ మంగళవారం నిర్వహించారు. గ్రామస్తులతో సీఐ రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురికి మించి గుమికూడటం చట్టరీత్యా నేరమన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించి పోలీసు శాఖకు సహకరించాలన్నారు. అనంతరం గ్రామంలోని అనుమానాస్పద గృహాలను, ఖాళీ స్థలాలను, పాడుబడ్డ గృహాలను, గడ్డి వాములను, పేడదిబ్బలను తనిఖీ చేశారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలతో వస్తే వాహనాలను అప్పగిస్తామని చెప్పారు. తనిఖీల్లో ముప్పాళ్ళ ఎస్సై పి.హజరతయ్య, ఏఎస్సైలు ఇమామ్, నవరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 111 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు మంగళవారం 111 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మ్యాథ్స్–బి, జువాలజీ, హిస్టరీ పరీక్షకు 675 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 603 మంది హాజరయ్యారు. 72 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మ్యాథ్స్–బి, జువాలజీ, హిస్టరీ పరీక్షకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 291 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 252 మంది హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ శైలజాకుమారి తెలిపారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు



కార్డన్ సెర్చ్‌లో సీఐ శ్రీనివాసరావు, సెబ్ సీఐ విజయ్ కుమార్, ఎస్ఐలు సంధ్యారాణి, సత్యనారాయణ

సత్తెనపల్లి: శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణంలోని ముస్లింపాలెంలో మంగళవారం పట్టణ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును సక్రమంగా నిర్వహించడమే పోలీసుల ముందున్న లక్ష్యమన్నారు. జూన్ 4న కౌంటింగ్ రోజు పట్టణ ప్రజలు క్రమశిక్షణతో పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగాలని, శాంతిభద్రతలకు ఎవరు ఆటంకం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. లెక్కింపు రోజున ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను పరిశీలన నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గుంటూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గుంటూరు సీఐ పి.విజయకుమార్, పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, పోలీసులు, మహిళా పోలీసులు తదితరులు ఉన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 670 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో మంగళవారం 670 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. టెన్త్ గణితం పరీక్షకు 1,769 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,099 మంది హాజరయ్యారు. 670 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదవ తరగతి సప్లిమెంటరీ లెక్కల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 181 మంది హాజరు కావాల్సి ఉండగా 105 మంది హాజరయ్యారు. 76 మంది గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించాలి

ఎంఈవో నరసింహారావు



వంట ఏజెన్సీల వారితో మాట్లాడుతున్న ఎంఈవో నరసింహారావు

అచ్చంపేట: విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని ఎంఈవో నరసింహారావు మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో మంగళవారం వంట ఏజెన్సీలకు, ఆయాలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులంతా నూరుశాతం మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే తినే విధంగా భోజనం వండాలన్నారు. ప్రతి రోజు తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. పాఠశాలలోనే భోజనం తయారు చేయాలని, బయట వండుకొని తేవడం వంటి పద్ధతులకు స్వస్తి పలకాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యాహ్న భోజనంలో తీసుకువచ్చిన మార్పులను కచ్చితంగా పాటించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించినవారిపై చర్యలు తప్పవన్నారు. వంటశాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన అలివేలమ్మ, ఎంపీపీఎస్, పెదపాలెం ఆర్ అండ్ సెంటర్, బి.పద్మ, జెడ్పీహెచ్ఎస్, అచ్చంపేట, జార్జమ్మ, ఎంపీపీఎస్, కోగంటివారిపాలెంకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఆళ్లమూడి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

రైతన్న.. నకిలీలతో జాగ్రత్త

- విత్తనాల కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు
- ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతాంగం



సత్తెనపల్లిలోని విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: రుతుపవనాలు వచ్చే సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ కోసం పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో రైతులు విత్తనాలు జల్లే పనులు చేపట్టనున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు కూడా నిబంధనలు పాటించాలంటున్నారు. 1985 ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం డీలర్లు నిబంధనలు పాటించాల్సి ఉంది.

విత్తన కొనుగోలులో...

వ్యవసాయ శాఖ లైసెన్సు పొందిన డీలర్ వద్ద, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీలు వేసి ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తన రకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర విషయాలను గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలర్ సంతకం ఉండాలి. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యవసాయ అధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేస్తే మంచిది. మొలకెత్తే దశ, పూత దశలో లోపం కనిపిస్తే మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

ప్రమాణం లేని ఎరువులు విక్రయించరాదు

ఎరువులను విక్రయించే వారు ప్రభుత్వం నుంచి విధిగా గుర్తింపు పొందాలి. నమోదు పత్రంలో పొందుపరిచిన ఎరువులనే విక్రయించాలి. డీలర్లు తమ వద్ద ఉన్న ఎరువులను వాటి ధరలను స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు విధిగా బిల్లులు ఇవ్వాలి. నిర్దేశించిన ప్రమాణం లేని ఎరువులను డీలర్లు విక్రయించరాదు. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై ఎర్ర సిరాతో గుర్తు వేసి, పక్కన పెట్టేయాలి.

విత్తన శుద్ధి తప్పనిసరి

- కిలో విత్తనాలకు రెండున్నర గ్రాముల కార్బన్ డైజం కలిపి 24 గంటల తర్వాత నారు మడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెట్టినట్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్ డైజం కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి నారు మడిలో చల్లుకోవాలి. ఒక కిలో విత్తనానికి ఒక లీటరు నీరు సరిపోతుంది.
- విత్తన శుద్ధికి 'సూడోమోనాస్ ఫ్లోరెన్స్' అనే జీవ శిలీంధ్ర నాశినిని కూడా ఉపయోగించవచ్చు. ఇది బయోలాజికల్ కంట్రోల్ ల్యాబొరేటరీలో తయారవుతుంది. వ్యవసాయ శాఖ వద్ద మాత్రమే లభిస్తుంది. దీనిని కేజీ విత్తనాలకు ఎనిమిది గ్రాములు వినియోగించాలి.
- రైతులు సొంత విత్తనాల వినియోగానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. సొంత విత్తనం తయారీపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించింది. దాంతో రైతులు సొంత విత్తన తయారీకి అలవాటు పడ్డారు.
- స్వపరాగ సంపర్కంతో వృద్ధి చెందే వరి విత్తనాలను రైతులు సులభంగా, నాణ్యంగా ఉత్పత్తి చేసుకోవచ్చు. తద్వారా కల్తీ విత్తనాల బారి నుంచి తప్పించుకోవచ్చు.

మొలక పరీక్ష చేసుకోవాలి

- రైతులు విత్తుకోవడానికి ఒక రోజు ముందు విత్తనాలను కొనుగోలు చేయడం వల్ల మొలక పరీక్షలు చేయించుకోవడం లేదు. తప్పనిసరిగా మొలక పరీక్ష చేయించుకోవాలి.
- రైతు కొనుగోలు చేసిన విత్తనాల నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి, అనంతరం ఒక గుడ్డలో చీకటి, గాలి తగలని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజల పైన మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకుని, నారు మడి వేసేందుకు సిద్ధం చేసుకోవాలి.
- మొలక శాతం కనీసం 75 శాతం ఉంటే విత్తనాలు నాణ్యమైనవి అని భావించి విత్తుకోవాలి.

నాణ్యమైన విత్తనంతోనే దిగుబడులు



రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు వహించాలి. నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులను పీఏసీఎస్‌లు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. ఒకవేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయ అధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందొచ్చు. దీని కోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. ఎక్కడా ఎరువులు, విత్తనాల కొరత వచ్చే ప్రసక్తే ఉండదు.

–ఎస్.శ్రీధర్ రెడ్డి, ఏడీఏ, సత్తెనపల్లి

సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ



విత్తనాలను పరిశీలిస్తున్న ఏవో కృష్ణయ్య

బెల్లంకొండ: మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య మంగళవారం తెలిపారు. రైతులు సాగుకు ముందు పచ్చిరొట్ట పైరు వేసి భూమిలో పూత సమయంలో కలియదున్నుటం వలన భూమిలో సేంద్రియ కర్బనం పెంచుట, రసాయన ఎరువుల వినియోగం తగ్గించుట, భూ భౌతిక స్థితి మెరుగు పరచుట జరుగుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు అయిన జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జనుము, జీలుగ 10 కేజీలు పూర్తి ధర రూ.880 కాగా రాయితీపై రూ.440, పిల్లి పెసర 8 కేజీలు పూర్తి ధర రూ.1,072 కాగా రాయితీ ధర రూ.536 చెల్లించి రైతు భరోసా కేంద్రాలలో ఆధార్, పట్టాదార్ పాసు బుక్, మొబైల్‌తో సిబ్బందిని సంప్రదించి విత్తనాలు పొందాలని కోరారు.

రుతుక్రమ ఆరోగ్య పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శిఖాశ్యాంసన్

క్రోసూరు: సృష్టికి మూలమైన రుతుక్రమంపై విస్తృత చర్చ, అవగాహన అవసరమని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ పేర్కొన్నారు. మంగళవారం రుతుక్రమం.. ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఎర్రబాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో కిశోర బాలికలకు, మహిళలకు జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. యువతులతో పాటు మహిళల్లో రుతుక్రమంపై అవగాహన పెంపొందించడం కోసం ఏటా మే 28న యూనిసెఫ్ ఆధ్వర్యంలో పీరియడ్స్ పరిశుభ్రత దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రుతుక్రమం అనేది సృష్టి కార్యమని దాన్ని సామాజిక బాధ్యతగా భావించి పరిశుభ్రతపై మహిళలు యువతులు అందరిలోనూ అవగాహన పెంపొందించినప్పుడే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమని ఆయన అన్నారు. కౌమార దశలోని బాలికలు, యువత, తల్లులు, తండ్రులు, అబ్బాయిలు ముఖ్యమైన ఈ యజ్ఞంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యు.వి.రజిని, ఆరోగ్య కార్యకర్త డి.స్వప్న రాణి, ఆశా కార్యకర్తలు పార్వతి, సుస్మిత, అంగన్‌వాడీ టీచర్ మల్లిక, కిశోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

33 మద్యం సీసాలు స్వాధీనం

దాచేపల్లి: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేంద్ర బాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం రాత్రి పొందుగల చెక్‌పోస్టు వద్ద ఎస్సై జి.సంధ్యారాణి వాహనాల తనిఖీలు చేపట్టారు. మిరియాలగూడ నుంచి దాచేపల్లి వైపు వస్తున్న పల్లె వెలుగు బస్సును తనిఖీ చేయగా అచ్చంపేట మండలం చెరుకుపాలెం గ్రామానికి చెందిన మైలు రవికుమార్ వద్ద రూ.22,770 విలువ చేసే 33 మద్యం సీసాలు గుర్తించారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న రవికుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ సురేంద్రబాబు వెల్లడించారు. సమావేశంలో ఎస్సై దాసరి శివనాగరాజు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పశర్లపాడులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మరావు

రెంటచింతల: సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. మంగళవారం రెంటచింతల పీహెచ్‌సీ పరిధిలోని పశర్లపాడు గ్రామ కాలనీలలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇళ్లలో ఉన్న పాతటైర్లు, కొబ్బరి బొండాలను వెంటనే తొలగించాలని, కూలర్లలోని నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందున్న సైడ్‌కాలువలలో వారానికి ఒక్కసారి కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని, దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని తెలిపారు. దోమతెరలను వాడుకోవాలని ఆయన సూచించారు. దోమలను పారదోలితే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు, బోద వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. వరుసగా రెండు, మూడు రోజుల పాటు జ్వరం వస్తే వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ మహేష్‌బాబు, ఏఎన్ఎం శిరీష, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా ఎయిర్ మిషన్‌లు



గాలి నింపే వ్యక్తి లేక పట్టణ సబ్ జైల్ ఆవరణలోని పెట్రోల్ బంక్‌లో ఎయిర్‌మిషన్

సత్తెనపల్లి: పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు మంచినీరు, మరుగుదొడ్లు, వాహనాలకు అవసరమైన గాలి నిమిత్తం ఎయిర్ మిషన్లు వంటివి ఏర్పాటు చేయాలనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో అలాంటి సౌకర్యాలు వినియోగదారులకు కల్పించడం లేదు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో వాహనాల టైర్లలో గాలి తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. బంకుల్లో పెట్రోలు నింపుకున్న అనంతరం వాహనాలలో గాలి నింపుకునేందుకు పలు పెట్రోల్ బంకుల్లో ఎయిర్ మిషన్‌లు అలంకార ప్రాయంగా ఉంటున్నాయి. ఎయిర్ మిషన్ ఉన్నప్పటికీ గాలి నింపే వ్యక్తులు ఉండటం లేదు. మరి కొన్ని చోట్ల గాలి నింపి నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి పెట్రోల్ బంకుల్లో వాహనాలకు గాలి నింపే సౌకర్యం కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు.